ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

గురువారం | జూన్ 18, 2026 | సంపుటి : 7 | సంచిక : 18 | పేజీలు : 2

## సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- గత ఏడాది రూ.3వేల కోట్లకుపైగా మోసపోయారు
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు



2 లో



ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. అరుదైన డి.ఎన్.డి అనే జన్యుపరమైన వ్యాధితో బాధపడుతూ ఎదుగుదల లేని స్థితిలో, మంచానికే పరిమితమైన యువ అభిమాని కోరికను మన్నించి స్వయంగా అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆర్థిక భరోసాతోపాటు భగవంతుని తీర్థప్రసాదాలు అందజేశారు. తెలంగాణ హనుమకొండ లోని హనుమాన్ నగర్ కి చెందిన 17 ఏళ్ల నిరంజన్ అరుదైన వ్యాధితో పోరాడుతున్నాడు. తన చివరి కోరికగా పవన్ కళ్యాణ్ ను కలవాలని అభిలషించారు. తెలంగాణ జనసేన నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఉప ముఖ్య మంత్రివర్యులు బుధవారం స్వయంగా నిరంజన్ ఇంటికి వచ్చారు.



# అభిమాని నిరంజన్‌కు జనసేనాని పరామర్శ



- జన్యుపరమైన అనారోగ్యంతో పోరాడుతున్న హనుమకొండకు చెందిన నిరంజన్
- అభిమాని కోరికతో ఇంటికి వెళ్లి పరామర్శించిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. తల్లిదండ్రులకు భరోసా..
- వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం
- నిరంజన్ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ శ్రీ వెంకటేశ్వరస్వామి తీర్థప్రసాదాలు అందజేత
- వరంగల్ భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

# ప్రభుత్వ చదువుకు.. నామోషీ పడొద్దు

### ఇక్కడ చదివినోళ్లు ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయ్యారు

- ప్రభుత్వ చదువుకు నామోషీ పడొద్దు
- ఇక్కడ చదివినోళ్లు ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయ్యారు
- 27లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తి
- త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ ప్రారంభిస్తాం
- తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి



**రంగారెడ్డి, ఆయుధం:**

రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ను సీఎం ప్రారంభించారు. స్కూల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసిన మైదానంలో సరదాగా విద్యార్థులతో ఫుట్బాల్ ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. "రాష్ట్ర బడ్జెట్లో దాదాపు రూ.27 వేల కోట్లు విద్యాశాఖపైనే ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ ఏర్పాటు చేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రుల్లో అపోహలు ఉన్నాయి. అందరి అపోహలు తొలగించేందుకే టీపీఎస్ నిర్మాణం చేపట్టాం. విద్య మాత్రమే మన జీవితాలను సమూలంగా మార్చగలదు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరం.

ప్రభుత్వ బడుల్లో చదవడం నామోషీ అనే ఆలోచన పోవాలి. ఇక్కడ చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారు. గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి.. కుల వ్యవస్థను ప్రోత్సహించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ పాఠశాలలు పెట్టింది. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తాం. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు మెస్సీని హైదరాబాద్కు తీసుకొస్తే విమర్శలు చేశారు. గత ప్రభుత్వం యూనిఫామ్లు ఇస్తే.. అవి నెలరోజులకే చిరిగాయి. ఈ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోంది. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచాం. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని ఒకాయన అంటున్నారు.. ఎలా సాధ్యమో చెప్పాలి. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం" అని సీఎం అన్నారు.



2 లో

## మోదీ పాలన వ్యవసాయ రంగానికి స్వర్ణయుగం

- బీజేపీ రాష్ట్ర (సంస్థాగత) ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ జీ.
- ఘనంగా 'ప్రకృతి వ్యవసాయం - రైతు కార్యశాల'



2 లో

## 20న పీఎం కిసాన్ నిధులు విడుదల


- రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్ నిధులు జూన్ 20న విడుదల కానున్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్యే బలమైన పునాది

- పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం
- విద్యార్థులు క్రమశిక్షణ, చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క

విద్యార్థుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్యే బలమైన పునాది అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. బుధవారం ములుగు మున్సిపాలిటీ పరిధిలోని జీవంతరావుపల్లిలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సి.ఆర్.ఆర్ 2025-26 నిధులు రూ.29.50 లక్షలతో పి.ఆర్ రోడ్డు నుండి మోడల్ స్కూల్ వరకు చేపట్టనున్న సి.సి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు తో కలిసి శంకుస్థాపన చేసి, "ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య - ప్రతి చేతిలో ఉచిత పాఠ్యపుస్తకాలు" అనే లక్ష్యంతో జీవంతరావుపల్లి పి.ఎం శ్రీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు, సలహాలను పాటిస్తూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని అన్నారు. జీవితంలో లోపాలను, కష్టాలను చూసి నిరుత్సాహపడకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ యూనిఫామ్‌లు, ఉచిత పాఠ్యపుస్తకాలు, అవసరమైన సకల సౌకర్యాలు, మెరుగైన వసతి కల్పిస్తూ విద్యా రంగాన్ని బలోపేతం చేస్తోందన్నారు. ప్రతి విద్యార్థి అందరిలో ఉత్తమంగా నిలవాలనే లక్ష్యంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని తమ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా జీవితాన్ని తీర్చిదిద్దే శక్తిగా భావించి సమగ్ర అభివృద్ధి సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, డీఈఓ సిద్ధార్థ్ రెడ్డి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





## నేడు ఎస్ఐఆర్–2026పై అవగాహనకు 2కె రన్

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ఆయుధం:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్లలో అవగాహన పెంచేందుకు గురువారం ఉదయం 7 గంటలకు 2కె రన్ నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లలో అవగాహన కోసం చేపట్టే ఈ కార్యక్రమాన్ని హనుమకొండ అదాలత్ సర్కిల్ లోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద నుండి జిల్లా కలెక్టరేట్ వరకు 2కె రన్ సాగుతుందని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.



## ప్రజల రవాణా సౌకర్యాల మెరుగుదలకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- నూతన బస్సు సర్వీస్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**సంగెం, ఆయుధం:** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం సంగెం మండలం కాట్రపల్లి గ్రామంలో వరంగల్ నుండి ఖిలా వరంగల్, స్తంభంపల్లి, వసంతాపూర్, వంచనగిరి, శాయంపేట, టెక్స్టైల్ పార్కు, సంగెం కుంటపల్లి మీదుగా కాట్రపల్లి వరకు నడిచే నూతన బస్సు సర్వీసును పరకాల శాసన సభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గారు స్వయాన సంగెం వరకు బస్ నడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, రవాణా సదుపాయాల కల్పనలో ఎలాంటి రాజీ పడబోమని, ప్రతి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.



## విధుల్లో రాణిస్తూనే పిల్లల అభ్యున్నతికై కృషి చేయాలి

**వరంగల్, ఆయుధం:** నిరంతరం విధినిర్వహణలో భాగంగా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తునే తమ పిల్లల అభ్యున్నతి కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలియజేసారు. ప్రతిష్టాత్మకమై ముంబాయి ఐఐటీ కళాశాలలో అడ్మిషన్ సాధించిన ఇన్స్పెక్టర్ కుమార్తెను వరంగల్ పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సతీష్ తనయురాలు యడ్లపల్లి సాత్విక జెఈఈ మెయిన్స్ పరీక్షలో 99.65 పర్సంటైల్ సాధించగా, ఇటీవల నిర్వహించిన జె.ఈ.ఈ అడ్వాన్స్ పరీక్షల్లో రాణించి 8808 ర్యాంక్‌తో ముంబాయి ఐఐటీ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీటు సాధించడం జరిగింది. దీనితో సాత్వికను వరంగల్ పోలీస్ కమిషనర్ తన చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిపి సాత్వికతో ముచ్చటిస్తూ రాబోవు రోజుల్లో మరింత కష్టపడాల్సి వుంటుందని. దేశంలోనే అత్యున్నతమైన విద్యా సంస్థలో సీటు సాధించడం గొప్ప విషయమని, ఇదే రీతిలో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని, ఉన్నత ఉద్యోగాలను సాధించడం సంతోషాన్ని కలిగిస్తోందని సీపీ తెలియజేశారు.



## హైదరాబాద్‌లో రూ.100 కోట్లతో ఇన్నోవేషన్ పార్కు

**హైదరాబాద్, ఆయుధం:** నగరంలోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో రూ.100 కోట్లతో ఇన్నోవేషన్ పార్కు ఏర్పాటు చేయనున్నారు. బిట్స్ పిలానీ, యాక్సిస్ బ్యాంకు కలిసి దీన్ని ఏర్పాటు చేయనున్నాయి. పారిశ్రామిక పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణల విభాగాల్లో ఇది పనిచేయనుంది.

# సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు



**జాతీయం, ఆయుధం:** దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సైబర్ నేరగాళ్లు అమాయక ఇన్వెస్టర్లను మోసగించి.. కోట్ల రూపాయలు దోచుకుంటున్నారంటూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి పరాన్నజీవుల పట్ల కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. సైబర్ నేరారోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి వివిధ రాష్ట్రాల్లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఒక్కటిగా కలిపేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణలో భాగంగా భారత ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు నిరాకరించారు.
సైబర్ నేరాల బాధితులు దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉంటారని సీజేఐ అన్నారు. సైబర్ నేరస్థులు ఒక రాష్ట్రంలో పోలీసులకు దొరికితే మరో రాష్ట్రానికి వెళ్లి అక్కడి ప్రజలను దోచుకుంటారని.. వారిని జైల్లో ఉంచడమే ప్రజలకు మంచిదని పేర్కొన్నారు. గతేడాది చివరి నాటికి భారతీయులు డిజిటల్ మోసాల వల్ల రూ.3వేల కోట్లకు పైగా నష్టపోయారని.. దేశంలో సైబర్ నేరాల తీవ్రతను ఇది తెలియజేస్తోందని సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉపశమనం కోరేందుకు సంబంధిత హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించారు.

# కృష్ణలంక ఘటనపై ఏపీ ప్రభుత్వం సీరియస్..

- సమగ్ర విచారణకు సీఎం ఆదేశం

**అమరావతి, ఆయుధం:** విజయవాడలోని కృష్ణలంక ఘటనను ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డీజీపీ హరీశ్ గుప్తాను సీఎం చంద్రబాబు ఆదేశించారు. గాదె సాయికృష్ణ అనే యువకుడిని లాకప్‌లోనే కొట్టి చంపారంటూ పోలీసులపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై ఉన్నతస్థాయి విచారణ జరిపి నిజానిజాలు నిగ్గుతేల్చాలని సీఎం ఆదేశించారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇప్పటికే కృష్ణలంక పీఎస్ సీఐను వీఆర్‌కు పంపామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు డీజీపీ తెలిపారు.



# శ్రమనే నమ్ముకున్న వ్యక్తి మండల రాములు

- అదనపు కలెక్టర్ వై.వి. గణేష్

**వరంగల్, ఆయుధం:** వరంగల్ రంగశాయిపేట కురుమవాడలో బుధవారం దివంగత మండల రాములు మూడవ రోజు సంతాప సభను కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వై.వి. గణేష్ హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల రాములు గొప్ప కష్టజీవి, అంకితభావం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. జీవితాంతం ఎవరి మీదా ఆధారపడకుండా తన కష్టాన్ని మాత్రమే నమ్ముకొని జీవించారని తెలిపారు. ఆయన అజం జాహీ మిల్స్‌లో కార్మికుడిగా 1991 వరకు సేవలందించి కుటుంబాన్ని ఆదర్శవంతంగా పోషించారని పేర్కొన్నారు. నేటి సమాజానికి మండల రాములు జీవితం స్ఫూర్తిదాయకమని, యువత ఆయన క్రమశిక్షణ, నిజాయితీ, శ్రమను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా ఇతరులకు ఎన్ని వెలుగు నింపవచ్చని, అలాగే వైద్య పరిశోధనల అభివృద్ధి కోసం మృతదేహ దానం చేయడం కూడా గొప్ప మానవతా సేవ అని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సంతాప సభలో మండల పరశురాములు, నరసింహ రాములు, కొల్లూరి యోగానంద్, డాక్టర్ సాంబ మూర్తి, మండల సీతారాములు, హరీష్, గుండు బాబురావు, కేడల ప్రసాద్, పరికిపండ్ల వేణు, కారేటి శంకర్ రావు యాదవ్, వాకుళాభరణం శ్రీనివాస్, శ్రవణ్ కుమార్, కుమ్మరి కృష్ణమూర్తి, బతిని రవికుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొని దివంగత మండల రాములు చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. మండల రాములు సేవలను, సాదాసీదా జీవన విధానాన్ని, సమాజం పట్ల ఆయనకు ఉన్న అంకితభావాన్ని స్మరించుకుంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మరుపల్లి రవి, కొంతం తారా మోహన్, కెడల పద్మ జనార్ధన్, మిత్రపరపతి సంఘం సభ్యులు జనతా పరపతి సంఘ సభ్యులు, జై హనుమాన్ సంఘ సభ్యులు, వినాయక పరపతి సంఘ సభ్యులు, హాజరై నివాళులర్పించారు.


# శివగంగేశ్వర మంటపానికి రూ.50,100 విరాళం



**వరంగల్, ఆయుధం:** వరంగల్ రంగశాయిపేట శివారు జక్కలొద్దీ వద్ద నిర్మిస్తున్న శివగంగేశ్వర మండప నిర్మాణానికి రిటైర్డ్ టీచర్, దామెర చెరువు స్విమ్మర్స్ అసోసియేషన్ కార్యదర్శి, మునుకుంట్ల రాములు తన వంతు సహాయంగా 50,100/ రూపాయలు విరాళంగా ఇచ్చి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా స్విమర్స్ సభ్యులు అందరూ సంతోషంగా మునుకుంట్ల రాములు ను పూలదండ, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దామెర చెరువు స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు న్యాయవాది, శేర్ల.అనిల్ కుమార్ మాట్లాడుతూ మన హిందూ పద్ధతులను, సనాతన ధర్మాన్ని కాపాడుకునేందుకు, ప్రజలలో భక్తి భావాన్ని పెంపొందించేందుకు ఈ రోజుల్లో తప్పనిసరిగా దేవాలయాల నిర్మాణం అవసరమని పేర్కొన్నారు. ఈ విధంగా నిర్మించే దేవాలయాల్లో హిందూ బంధువులు అందరూ ఎవరి శక్తి కొలది వారు సహాయ సహకారాలు అందించుకున్న హిందూ ధర్మం అభివృద్ధి దిశగా పయనిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దామెర చెరువు స్విమ్మర్స్ అసోసియేషన్ అంకతి రాజేందర్, ఉపాధ్యక్షులు తాడెం కుమార్, పస్తం బిక్షపతి, జక్కుల రాందేవ్, అప్పాల సత్యనారాణ, మందాటి రవీందర్, అడ్డగట్ల జ్ఞానేశ్వర్, కాసర్ల భాస్కర్, మురికి రవి, రాజు వెంకన్న, ప్రసంగి ఆవునూరి రామన్న, కొమురయ్య, మురళి, కోటన్న సతీష్, మంద కిషన్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మర్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- తెలంగాణ కుమ్మరి యువసేన రాష్ట్ర కార్యదర్శి రాజ్ కోటి



**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణలో కుమ్మరుల సామాజిక, ఆర్థిక ఎదుగుదల కోసం ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కుమ్మర్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ కుమ్మరి సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తెలంగాణ కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ కుమ్మర యువసేన రాష్ట్ర కార్యదర్శి సముద్రాల రాజ్ కోటి మాట్లాడుతూ.. శతాబ్దాలుగా సమాజానికి సేవ చేస్తున్న కుమ్మరులు నేడు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, వారిని ఆదుకోవడానికి కార్పొరేషన్ ఏర్పాటు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సాంప్రదాయ వృత్తులకు పూర్వవైభవం తేవడంతో పాటు, కుమ్మరి యువతకు ఉపాధి, రుణ సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ముఖ్య నేతలు ప్రత్యేక కండువాలు ధరించి పాల్గొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.







# అభిమాని నిరంజన్‌కు జనసేనాని పరామర్శ

- జన్యుపరమైన అనారోగ్యంతో పోరాడుతున్న హనుమకొండకు చెందిన నిరంజన్
- అభిమాని కోరికతో ఇంటికి వెళ్లి పరామర్శించిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. తల్లిదండ్రులకు భరోసా..
- వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం
- నిరంజన్ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ శ్రీ వెంకటేశ్వరస్వామి తీర్థప్రసాదాలు అందజేత
- వరంగల్ భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

**హనుమకొండ, ఆయుధం:** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. అరుదైన డి.ఎన్.డి అనే జన్యుపరమైన వ్యాధితో బాధపడుతూ ఎదుగుదల లేని స్థితిలో, మంచానికే పరిమితం అయిన యువ అభిమాని కోరికను మన్నించి స్వయంగా అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆర్థిక భరోసాతోపాటు భగవంతుని తీర్థప్రసాదాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం హనుమకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ కి చెందిన 17 ఏళ్ల నిరంజన్ అరుదైన వ్యాధితో పోరాడుతున్నాడు. తన చివరి కోరికగా పవన్ కళ్యాణ్‌ను కలవాలని అభిలషించారు. తెలంగాణ జనసేన నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రివర్యులు బుధవారం స్వయంగా నిరంజన్ ఇంటికి వెళ్లారు. అతన్ని దగ్గరకు తీసుకుని పరామర్శించారు. తల్లిదండ్రులు పొనుగోటి రాంగోపాల్, మానసతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యం ఎక్కడ చేయిస్తున్నారు? అతన్ని కాపాడుకోవడానికి ఏం చేయొచ్చు అన్న విషయాలపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని భగవంతుడి ఆశీస్సులు బాబుకి ఉంటాయని చెప్పి కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపారు. శ్రీ వెంకటేశ్వరస్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. నిరంజన్ ఆరోగ్యం కోసం వరంగల్ విఖ్యాత భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేయిస్తానని తెలిపారు.







### చలించిపోయిన పవన్ కళ్యాణ్

నిరంజన్ ను చూసేందుకు వచ్చిన పవన్ కళ్యాణ్ ఆతనితో చాలా సమయం గడిపారు. ఇంట్లోకి వచ్చిన పవన్ కళ్యాణ్ లేవలేని స్థితిలో ఉన్న అభిమానిని చూసి చలించిపోయారు. అతని మంచంపై కూర్చుని ఆత్మీయంగా హత్తుకున్నారు. నుదిటిపై ముద్దు పెట్టి ఆప్యాయంగా పలకరించారు. 'చిన్ననాటి నుంచి మీరంటే అభిమానం' అని నిరంజన్ చెప్పిన మాటలు విని కదలిపోయారు. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తెప్పించిన వస్త్రాన్ని అతనికి కప్పి, కళ్యాణం అక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు. భద్రకాళి అమ్మవారి వెండి ప్రతిమకు ఆలయంలో పూజ చేయించి కుటుంబ సభ్యులకు అందజేస్తానని తెలిపారు.
నిరంజన్ ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ కళ్యాణ్ ను అనుకరిస్తూ చేసిన డాన్సుల తాలూకు వీడియోలు, ఫొటోలను తిలకించారు. అంతా తనని చోటా గబ్బర్ సింగ్ అని పిలుస్తారని నిరంజన్ చెప్పాడు.

### కుటుంబ జీవనోపాధికి క్యాంటీన్

ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపి పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్ ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటీన్లో పని చేసేవారమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటీన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నాయకులకి దిశానిర్దేశం చేశారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ కళ్యాణ్ నేరుగా వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. పవన్ కళ్యాణ్ తోపాటు జనసేన పార్టీ తెలంగాణ ఇంఛార్జ్ శంకర్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, పార్టీ నాయకులు రాధారం రాజలింగం, ఆర్.కె.సాగర్ ఉన్నారు.







# ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలన వ్యవసాయ రంగానికి స్వర్ణయుగం

- ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలన వ్యవసాయ రంగానికి స్వర్ణయుగం
- బీజేపీ రాష్ట్ర (సంస్థాగత) ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ జీ
- మామునూర్ కృషి విజ్ఞాన కేంద్రంలో బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా 'ప్రకృతి వ్యవసాయం - రైతు కార్యశాల'
- ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర (సంస్థాగత) ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ జీ.
- 12 సంవత్సరాల విశ్వాసం, అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మోదీ పాలన

**వరంగల్, ఆయుధం:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో 12 సంవత్సరాలుగా దేశంలో సాగుతున్న సుపరిపాలన, రైతాంగ సంక్షేమం, ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యతను వివరిస్తూ వరంగల్ జిల్లాలోని మామునూర్ కృషి విజ్ఞాన కేంద్రం (KVK) లో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో "రైతు కార్యశాల" అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ జీ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యశాలను ప్రారంభించారు. ఈ కార్యశాలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, సేంద్రీయ ఎరువుల తయారీపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ 12 ఏళ్ల విజయాల ప్రదర్శనను చంద్రశేఖర్ తివారీ తిలకించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ తివారీ జీ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏండ్ల పాలన దేశ చరిత్రలో "విశ్వాసం - అభివృద్ధి - ప్రజా సంక్షేమం" మరియు వ్యవసాయ రంగంలో ఒక స్వర్ణయుగానికి నాంది పలికిందని కొనియాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వం అన్నదాతల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని పాలిస్తోందని స్పష్టం చేశారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, భూసారాన్ని కాపాడుతూ, మానవ ఆరోగ్యానికి మేలు చేసే ప్రకృతి వ్యవసాయాన్ని మోదీ ప్రభుత్వం ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తోందని చంద్రశేఖర్ జీ తెలిపారు. రైతులు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని అధిక లాభాలు పొందేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా దేశవ్యాప్తంగా కోట్ల మంది రైతులకు ఏటా రూ. 6,000 పెట్టుబడి సాయాన్ని నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తున్నామని గుర్తుచేశారు. పీఎం ఫసల్ బీమా యోజన, సాయిల్ హెల్త్ కార్డులు, ఈనామ్ డిజిటల్ మార్కెటింగ్, 'నమో డ్రోన్ దీదీ' వంటి సాంకేతిక విప్లవాల ద్వారా రైతులకు పూర్తి భద్రత, సాధికారత లభించిందని పేర్కొన్నారు. సబ్కా సాథ్ - సబ్కా వికాస్ - సబ్కా విశ్వాస్" అనే సంకల్పంతో అభివృద్ధి ఫలాలను సమాజంలో చివరి వ్యక్తికి చేరవేస్తూ, 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధించడమే మోదీ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పిలుపునిచ్చారు. వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ, మైక్రో ఇరిగేషన్ (బిందు సేద్యం) వంటి ఆధునిక పద్ధతులను రైతులు అందిపుచ్చుకోవాలని, దీనికోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదువుకున్న గ్రామీణ యువత కేవలం ఉద్యోగాల వైపు కాకుండా, ప్రకృతి వ్యవసాయాన్ని ఒక వ్యాపార నమూనాగా మార్చుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు.
మోడీ నాయకత్వంలో వరంగల్ నగరాన్ని తెలంగాణలోనే ఒక ప్రముఖ ఆర్థిక, పారిశ్రామిక, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, మెగా టెక్స్‌టైల్ పార్క్, రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్, స్మార్ట్ సిటీ మిషన్, హృదయ్ పథకం, నేషనల్ హైవేల అనుసంధానం, PMSSY కింద వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వంటి అనేక నిధులతో ప్రధాని నరేంద్ర మోడీ సమర్థవంతమైన నేతృత్వంలో చారిత్రక నగరమైన వరంగల్ అన్ని రంగాలలో అపూర్వమైన అభివృద్ధిని సాధిస్తోందని తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. గౌతమ్ రావు, జాతీయ కౌన్సిల్ మెంబర్ గుజ్జుల ప్రేమెందర్ రెడ్డి, మాజీ పార్లమెంటు సభ్యుడు అజ్మీరా సీతా రామ్ నాయక్, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, టి.రాజేశ్వర రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, వన్నాల వెంకటరమణ, జిల్లా అధ్యక్షులు నిషిధర్ రెడ్డి, మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి, వంగాల సమ్మిరెడ్డి, నాగపురి రాజమౌళి గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాడ శ్రీనివాసరెడ్డి, జలగం రంజిత్, కుసుమ సతీష్, రత్నం సతీష్, సిద్ధం నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్, రాష్ట్ర నాయకులు కంభంపాటి పుల్లారావు, మంజుల రెడ్డి, గందె నవీన్, సర్పంచ్ కన్నయ్య, రమ్య రాజు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులు, పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


**వరంగల్, ఆయుధం:** బీజేపీ నాయకుడు ఆడెపు వెంకటేష్ తన 39వ జన్మదినాన్ని పురస్కరించుకుని స్మశాన వాటికలో 39 మొక్కలను నాటారు. 39వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా 39 మొక్కలను నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తన వంతు బాధ్యతను నిర్వర్తించానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలతో జరుపుకోవాలని అన్నారు. మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, GWMC అధికారులు కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ వెంకటేష్ ధన్యవాదాలు తెలిపారు.

# 20న పీఎం కిసాన్ నిధులు విడుదల

**ఢిల్లీ, ఆయుధం:** రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ నిధులు జూన్ 20న విడుదల కానున్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ చేయనున్నారు. పీఎంకిసాన్ పథకాన్ని 2019లో మోదీ సర్కారు ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు.
పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్దిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్ధిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇకేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇకేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

# భారత సంతతి వ్యక్తికి ₹5 కోట్ల జాక్‌పాట్

**జాతీయం, ఆయుధం:** అబుధాబిలో భారత సంతతి వ్యక్తికి జాక్‌పాట్ తగిలింది (Bank Lottery UAE). ఒక బ్యాంక్ నిర్వహిస్తోన్న మిలియనీర్ క్యాంపెయిన్‌లో అతడిని అదృష్టం వరించింది. ఖాతా తెరిచిన రెండు నెలల్లోనే షజీర్ వెంగా అనే వ్యక్తి ఏకంగా దాదాపు రూ.5.15 కోట్లు గెల్చుకున్నారు.
యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని షార్జా ఇస్లామిక్ బ్యాంక్ (SIB) ఏటా 'మిలియనీర్ క్యాంపెయిన్' నిర్వహిస్తుంటుంది (UAE Millionaire Campaign). వినియోగదారులు పొదుపు వైపు మొగ్గు చూపేలా ప్రతి సంవత్సరం 20మిలియన్ల దిర్హామ్స్‌ను ప్రైజ్‌మనీగా కేటాయించింది. 10వేల దిర్హమ్‌లు ఖాతాలో డిపాజిట్ చేసేవారు రెగ్యులర్ డ్రాలో పాల్గొనే అవకాశం ఉంటుంది. ప్రతి 10వేల దిర్హామ్‌లకు ఒకసారి ఆ అవకాశం లభిస్తుంది. ఆ డ్రాలో గెలిచిన వారు క్యాష్ రివార్డ్స్, లగ్జరీ వాహనాలు వంటి భారీ బహుమతులు గెల్చుకునే వీలుంటుంది. అబుధాబిలో నివసిస్తున్న షజీర్ వెంగా.. రెండు నెలల క్రితం ఈ బ్యాంకులో ఖాతా తెరిచి, రెగ్యులర్ డ్రాలో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారు. తాజాగా బ్యాంక్ మిలియనీర్ డ్రా విజేతలను ప్రకటించగా.. వెంగా 2మిలియన్ దిర్హమ్స్ (దాదాపు రూ.ఐదు కోట్లకు పైగా)ను గెల్చుకున్నారు. వెంగాతో పాటు ఇతర విజేతల వివరాలను సదరు బ్యాంకు తన 'ఎక్స్' ఖాతాలో ప్రకటించింది.



తనకు వరించిన అదృష్టంపై వెంగా సంతోషం వ్యక్తం చేశారు. ''మిలియనీర్ క్యాంపెయిన్ గురించి తెలుసుకొని, ఏదో ఒకరోజు అందులో గెలవాలని అనుకున్నాను. ఇప్పుడు నాకు వచ్చిన ఈ క్యాష్ రివార్డ్.. నా జీవితాన్ని మార్చేస్తుంది. ఇక భారత్ నుంచి నా కుటుంబాన్ని యూఏఈకి తీసుకు వస్తాను'' అంటూ బ్యాంక్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695